## దేశానికి తెలంగాణ దాల్

- 18 రాష్ట్రాలకు మన శనగపప్పు
- రాయితీపై రూ.60కే పంపిణీ
- నేడు హైదరాబాద్‌లో 'భారత్ దాల్' పేరుతో షురూ
- దేశవ్యాప్తంగా హాకా బిజినెస్

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రం మరో అద్భుత పథకానికి కేంద్ర బిందువు కానున్నది. రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ హైదరాబాద్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్ (హాకా) దేశవ్యాప్తంగా శనగ పప్పు పంపిణీ చేయనున్నది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో 'భారత్ దాల్' పేరుతో రాయితీపై అందజేయనున్నది. ప్రస్తుతం మార్కెట్లో కిలో శనగపప్పు ధర రూ.90 ఉండగా, హాకా రాయితీపై రూ.60కే అందించనున్నది. ఈ పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం హెచ్ఐసీసీలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, కేంద్ర వినియోగదారుల శాఖ కార్యదర్శి రోహిత్‌కుమార్ సింగ్ కలిసి లాంఛనంగా ప్రారంభించనున్నారు. అనంతరం దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో పంపిణీ చేపట్టనున్నారు. తొలి దశలో 35 వేల టన్నుల శనగపప్పును పంపిణీ చేయనున్నారు.

### 18 రాష్ట్రాలు.. 180 పట్టణాలు

దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లో, ఒక్కో రాష్ట్రంలో 10 పట్టణాల్లో తెలంగాణ పప్పు అందుబాటులో ఉంచాలని కార్యాచరణ రూపొందించింది. ఆయా రాష్ట్రాల్లో పంపిణీకి వీలుగా డిస్ట్రిబ్యూటర్లను నియమించింది. మెట్రో నగరాలైన ముంబై, కలకత్తా, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ఇలా ప్రతి నగరంలోనూ 200 చొప్పున ఆటోలను ఏర్పాటుచేసి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానున్నది. డీ-మార్ట్ వంటి ప్రధాన మార్టులపాటు ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్ జొమాటో, స్విగ్గి సహా చిన్న పెద్ద స్టోర్స్‌లో అందుబాటులో ఉంచనున్నారు. హాస్పిటల్స్, జైళ్లు, క్యాంటీన్లు, దేవాలయాలకు కూడా సరఫరా చేయనున్నారు. వీరికి 30 కేజీల బ్యాగ్‌ను కిలో రూ.55 చొప్పున అందించనున్నారు. మూడు నెలల క్రితం హాకా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మచ్చా శ్రీనివాసరావు.. హాకాకు జాతీయ స్థాయిలో వ్యాపారం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా గుర్తింపు తీసుకొచ్చారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా శనగపప్పు పంపిణీని ప్రారంభించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని హాకా చైర్మన్ మచ్చా శ్రీనివాసరావు ప్రజలను కోరారు.

# కాంగ్రెసోళ్లవి సిగ్గులేని మాటలు

- వాళ్లను ఏమనాలో అర్థంకావట్లే
- హస్తం పార్టీ పాలనలో రైతుల ఆత్మహత్యలు, ఆకలిచావులు
- ఆయిల్‌పాంతో రైతులకు ఆదాయం
- ఐదు సంవత్సరాల్లో 20 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యం
- సీఎం కేసీఆర్‌కు దైవ సంకల్పం ఉంది
- మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- నర్మెటలో రూ. 300 కోట్లతో పామాయిల్ కర్మాగారం ఏర్పాటుకు హరీశ్ భూమిపూజ



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో పామ్ ఆయిల్ కర్మాగారానికి భూమి పూజ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

సిద్దిపేట, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ''యాభై ఏండ్ల కాంగ్రెస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు, ఆకలి చావులు, బీడు భూములు ఉండేవి. అప్పట్లో యాసంగిలో ట్రాన్స్‌ఫార్మర్ కాలకుండా, మోటారు కాలిపోకుండా ఏ ఒక్క రైతు అయినా పంట పండించాడా ? ఇప్పుడేమో కేసీఆర్ కరెంటు సరిగ్గా ఇస్తలేడని కాంగ్రెసోళ్లు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు'' అని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. శనివారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో 62 ఎకరాల విస్తీర్ణంలో రూ. 300 కోట్లతో ఆయిల్‌పాం కర్మాగారానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. గతంలో మీరు పాలించినప్పుడు పొద్దంతా కరెంట్ ఉందా? అని కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. ఉచిత కరెంట్ అని ఉత్త కరెంట్ చేసింద్రు. పొద్దందాక మూడు గంటల కరెంట్ రాకపోతుండే అని పేర్కొన్నారు. ఇప్పుడేమో మూడు గంటలు కరెంటిస్తే మూడు ఎకరాలు పారుతుందని మాట్లాడుతున్న వీళ్లను ఏమనాలో అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిసొంటోళ్లు రేపు ఈ రాష్ట్రాన్ని పాలించగలుగుతారా? అని రైతులు ఆలోచించాలని కోరారు. రైతే రాజన్న నినాదాన్ని సీఎం కేసీఆర్ నిజం చేశారని పేర్కొన్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించి వారి పిల్లలు డాక్టర్లుగా, ఇంజినీర్లుగా చదువుకునే పరిస్థితులు కల్పించారని వివరించారు. రాష్ట్రంలో 24 లక్షల పంపుసెట్లు నడుస్తున్నాయని తెలిపారు. నీటి తీరువా, కరెంటు బిల్లు లేదని, పైపెచ్చు సీఎం కేసీఆరే ఎదురు ఇస్తున్నారని పేర్కొన్నారు. 60 ఏండ్లలో కాంగ్రెస్ పార్టీ ఏనాడైనా ఈ రకంగా ఆలోచించిందా? దేశంలో ఎక్కడైనా బీజేపీ ప్రభుత్వం ఇస్తున్నదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ వల్ల దేశం ఎంతగానో నష్టపోతున్నదని మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం విదేశాల నుంచి మనం రూ. 1.56 వేల కోట్ల విలువైన మంచి నూనెను దిగుమతి చేసుకుంటున్నట్టు తెలిపారు. దేశానికి అవసరమైన మంచినూనెలో మనదగ్గర 40 శాతం మాత్రమే ఉత్పత్తి అవుతున్నదని పేర్కొన్నారు.

### ఆయిల్‌పాం సాగు.. రైతున్న ఆదాయం బాగు

అయిల్‌పాం సాగు రైతులకు అభయహస్తం లాంటిదని మంత్రి పేర్కొన్నారు. 'ఆయిల్‌పాం సాగు.. రైతన్న ఆదాయం బాగు' అనే నినాదాం పెట్టుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. వరి పంటకు గ్యారెంటీ లేదని, అకాల వర్షాలు, ఇతర కారణాలతో అది దెబ్బతినే అవకాశం ఉందన్నారు. కానీ, పామాయిల తోటలకు అలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. జనం ఉన్నంత వరకు నూనె కావాలని, పామాయిల్ పంటకు ఫుల్ డిమాండ్ ఉంటుందని వివరించారు. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో పామాయిల్ తోటలు సాగు చేయాలని సీఎం కేసీఆర్ లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఆయిల్‌పాం ప్రెస్సింగ్ తర్వాత మిగిలిన పొట్టును కోళ్లకు, పశువులకు దాణా తయారుచేసే కర్మాగారం కూడా అంతర్భాగంగా నిర్మించబోతున్నట్టు పేర్కొన్నారు. మిగిలిన పిప్పితో విద్యుత్తు తయారీ కేంద్రాన్ని కూడా నిర్మిస్తామన్నారు. ఇంత మంచి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్, వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఆయిల్ ఫెడ్ సంస్థకు రైతుల పక్షాన మంత్రి హరీశ్‌రావు ధన్యవాదాలు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు లేకుంటే ఆయిల్‌పాం సాగు జరిగేదే కాదని తెలిపారు. సముద్రతీరం ఉన్న చోటనే పామాయిల్ తోటలు ఉన్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా పెద్ద ఎత్తున రిజర్వాయర్లు నిర్మించుకొని చెరువులు, చెక్‌డ్యామ్‌లు నింపుకోవడంతో ఆయిల్‌పాంసాగుకు అనుకూలమైన వాతావరణం ఏర్పడినట్టు వివరించారు. 'సీఎం కేసీఆర్‌కు దైవసంకల్పం ఉందని, అందుకనే ఈ 9 ఏండ్లలో ఏనాడూ కరువు రాలేదని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యానవనశాఖ కార్యదర్శి హన్మంతరావు, జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణశర్మ, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎమ్మెల్యే వొడితెల సతీశ్, అటవీ సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ సోంరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

### షీటీమ్స్, సఖీ కేంద్రాలు దేశానికే ఆదర్శం

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2014లో ప్రారంభించిన షీటీమ్స్, సఖీ, భరోసా కేంద్రాలు దేశానికే ఆదర్శంగా మారాయని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సఖీ, భరోసా భవనాలను శనివారం డీజీపీ అంజనీకుమార్, అడిషనల్ డీజీపీ, ఉమెన్ సేఫ్టీ హెడ్ షికాగోయల్, డీఐజీ రమేశ్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, పోలీస్ కమిషనర్ శ్వేతతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. బాధితులు ఎవరైనా ఇక్కడికి వచ్చి అన్ని రకాలుగా న్యాయం పొందవచ్చన్నారు. ఇక్కడ బాధితులకు వైద్యం, న్యాయం, రక్షణ కల్పిస్తుందని తెలిపారు. సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా పోలీస్ శాఖ పనిచేస్తున్నదన్నారు. సిద్దిపేటలో భరోసా, సఖీ సెంటర్లు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. దేశంలో తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే ప్రతి పోలీస్ స్టేషన్‌లో మహిళా విభాగం ఏర్పాటు చేసినట్టు మంత్రి తెలిపారు. డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ..రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం కమిట్‌మెంట్‌తో పనిచేస్తున్నదన్నారు. అడిషనల్ డీజీపీ షికా గోయల్ మాట్లాడుతూ..హైదరాబాద్ అందరికీ సేఫ్టీ నగరమని అన్నారు

### 3 నెలల చిన్నారికి నామకరణం

సిద్దిపేటలో రూ. 30 లక్షలతో నిర్మించిన శిశు గృహను శనివారం మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. అనంతరం .శిశుగృహలో అనాథ శిశువులను మంత్రి హరీశ్‌రావు పరిశీలిస్తున్న క్రమంలో ఓ చిన్నారికి శ్రీ అని నామకరణం చేసి కాసేపు ఎత్తుకుని లాలించారు. సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లి శివారులో నిరుపేద తల్లి 3 నెలల ఈ చిన్నారిని విక్రయిస్తుండగా జిల్లా బాలల సంరక్షణ అధికారులు తల్లి నుంచి స్వాధీనం చేసుకుని శిశుగృహలో చేర్పించారు. చిన్నారికి పేరు పెట్టిన మంత్రి.. శ్రీజ ముఖంలో చిరునవ్వులు వెల్లివిరియాలని, నిండునూరేళ్లు సుఖసంతోషాలతో జీవించేలని ఆశీర్వదించారు.





మండలిలోని తన చాంబర్‌లో కేరళ మంత్రి అహ్మద్ దేవర కోవిల్‌ను సత్కరిస్తున్న చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి. చిత్రంలో కార్యదర్శి వీ నర్సింహాచార్యులు తదితరులు

## తెలంగాణ అభివృద్ధి అద్భుతం

- కేరళ మంత్రి అహ్మద్ దేవర కోవిల్ ప్రశంస
- రాష్ట్ర శాసనసభ, శాసన మండలి సందర్శన
- మండలి చైర్మన్ గుత్తాతో భేటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి అద్భుతంగా సాగుతున్నదని కేరళ రాష్ట్ర స్పోర్ట్స్, మ్యూజియమ్స్, ఆర్కియాలజీశాఖల మంత్రి అహ్మద్ దేవర కోవిల్ ప్రశంసించారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై తమకు సంపూర్ణ అవగాహన ఉన్నదని చెప్పారు. శనివారం రాష్ట్ర శాసనమండలి, శాసనసభలను ఆయన సందర్శించారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. శాసనసభ, శాసన మండలి సమావేశ మందిరాలను కేరళ మంత్రికి చూపించారు. రాష్ట్ర శాసనసభ సమావేశాల తీరు, ఉభయ సభల్లో జరిగే చర్చలు, తీసుకున్న చారిత్రక నిర్ణయాలు, ప్రజాస్పందన వంటి విశేషాలను ఈ సందర్భంగా గుత్తా.. కేరళ మంత్రికి వివరించారు. తెలంగాణ చారిత్రక పోరాట నేపథ్యం గొప్పదని, ఆ స్ఫూర్తితో రాష్ట్రం అద్భుతంగా పురోగమిస్తున్నదని కేరళ మంత్రి దేవర కోవిల్ కొనియాడారు. కార్యక్రమంలో శాసనసభ కార్యదర్శి వీ నర్సింహాచార్యులు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.



ఈ-మైనింగ్ యాప్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి. చిత్రంలో సీఎస్

## పారదర్శకత, అక్రమాల నివారణకు గనుల శాఖ 'ఈ-మైనింగ్'

**యాప్‌ను ప్రారంభించిన మంత్రి పట్నం**

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఇటుక, ఇసుకతోపాటు వివిధ రకాల గనుల రవాణా సందర్భంగా ఎటువంటి అక్రమాలకు తావులేకుండా చూడడంతోపాటు పారదర్శకతను పెంచేందుకు గనుల శాఖ ఈ-మైనింగ్ యాప్ పేరుతో కొత్త మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. శనివారం సచివాలయంలో ఈ యాప్‌ను సీఎం శాంతి కుమారితో కలిసి మంత్రి పట్నం మహేందర్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ గనులు, భూగర్భ వనరుల శాఖ, హైదరాబాద్‌లోని జాతీయ సమాచార విజ్ఞాన కేంద్రం (ఎన్ఐసీ) సంయుక్తంగా ఈ యాప్‌ను అభివృద్ధి చేసినట్టు చెప్పారు. గనులు, భూగర్భ వనరుల శాఖలో పారదర్శకతను పెంచడంతోపాటు అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈ-మైనింగ్ మొబైల్ యాప్ దోహదం చేస్తుందని పేర్కొన్నారు. డీలర్లు, లీజు హోల్డర్లు ఖనిజ రవాణా అనుమతుల వివరాలను కూడా ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు.



మహేశ్వరంలో మార్కెట్ షెడ్డును ప్రారంభిస్తున్న మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్. చిత్రంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, జడ్పీ చైర్పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి

## అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలు

**మహేశ్వరంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి సత్యవతి**

హైదరాబాద్ సిటీబ్యూరో/మహేశ్వరం, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలను నిర్మిస్తున్నామని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఆమె శనివారం మహేశ్వరం మండల కేంద్రంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహేశ్వరంలో రూ.69 లక్షలతో మార్కెట్ షెడ్డు, రూ.4.20 కోట్లతో గిరిజన వసతి గృహం, రూ.5 కోట్లతో సంక్షేమ బాలుర పాఠశాలను ప్రారంభించారు. అనంతరం సేవాలాల్ ఆలయం, కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి సత్యవతి మాట్లాడారు. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గంలో 24 కులాలకు ఆత్మగౌరవ భవనాలను రూ.15 కోట్లతో మంత్రి సబిత నిర్మించారని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గానికి ఎనలేని సేవలందిస్తున్న సబితారెడ్డిని వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. అనంతరం ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్‌ల హామీలకు గ్యారెంటీ లేదన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

## స్వామినాథన్‌కు భారతరత్న ఇవ్వాలి

- దేశ రైతాంగానికి ఆయన సేవ ఘనం
- వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి
- స్వామినాథన్ పార్థివదేహానికి నివాళి

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ పార్థివదేహానికి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నివాళి అర్పించారు. శనివారం వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కేశవులుతోపాటు చెన్నై వెళ్లిన నిరంజన్‌రెడ్డి.. స్వామినాథన్ అంత్యక్రియాల్లో పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. స్వామినాథన్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. తద్వారా శాస్త్రవేత్తలను, ఈ దేశ రైతాంగాన్ని, వ్యవసాయరంగాన్ని గౌరవించినట్టు అవుతుందని పేర్కొన్నారు. స్వామినాథన్ లాంటి వారు యుగానికొక్కరు పుడతారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ఆకలితో అలమటించి లక్షల మంది చనిపోయిన పరిస్థితిని చూసి చలించిపోయిన ఆయన.. వైద్య విద్యను వదిలేసి వ్యవసాయ పరిశోధకుడిగా మారారని గుర్తుచేశారు. ఈ వందేండ్లలో ప్రపంచాన్ని ప్రభావితం చేసిన అతి కొద్దిమందిలో అద్భుతమైన శాస్త్రవేత్తల్లో స్వామినాథన్ ఒకరని కొనియాడారు. ఆయన సారథ్యంలో ఏర్పడిన కమిషన్ రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని సూచించిందని, కానీ బీజేపీ ప్రభుత్వం అమలు చేయకుండా రైతాంగానికి అన్యాయం చేసిందని మండిపడ్డారు. 2 నెలల క్రితమే వారిని వ్యక్తిగతంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నామని గుర్తుచేశారు. ఆరోగ్యం కుదుటపడితే తెలంగాణకు వచ్చి అభివృద్ధిని చూస్తానని చెప్పారని వెల్లడించారు. తెలంగాణ రైతాంగం, ప్రజలు, ప్రభుత్వం పక్షాన వారికి శిరస్సు వచ్చి శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్టు తెలిపారు.

## మైనింగ్ సేఫ్టీలో తాడిచెర్ల-1 ఓసీ ఫస్ట్

**జెన్‌కో సీఎండీ ప్రభాకర్ అభినందన**

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): మైనింగ్ సేఫ్టీ విభాగంలో టీఎస్ జెన్‌కోకు చెందిన తాడిచెర్ల-1 ఓపెన్‌కాస్ట్‌కు మొదటి బహుమతి లభించింది. 53వ వార్షిక భద్రతా పక్షోత్సవాల-2021లో భాగంగా ఉత్తమ సేఫ్టీ ప్రమాణాలు పాటించినందుకు ఈ అవార్డు దక్కింది. హైదరాబాద్‌లో రీజియన్ మైనింగ్ సేఫ్టీ డీజీ నుంచి కోల్ అండ్ కమర్షియల్ సీఈ బాలరాజు, మైన్స్ జీఎం మోహన్‌రావు అవార్డు అందుకున్నారు. అవార్డుకు కృషి చేసిన వారిని జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, డైరెక్టర్ టీఆర్కే రావు అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలని కోరారు.

## సింగరేణి బదిలీ వర్కర్ల రెగ్యులరైజ్

- జనరల్ మజ్దూర్లుగా 2,266 మంది క్రమబద్ధీకరణ
- యాజమాన్యం ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): సింగరేణిలో పని చేస్తున్న బదిలీ వర్కర్లకు యాజమా న్యం తీపి కబురు చెప్పింది. 2,266 మందిని జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరించింది. ఈ మేరకు శనివారం సంస్థ సీఎండీ శ్రీధర్ ఆదేశాలతో డైరెక్టర్ బలరామ్ ఉత్తర్వులు జారీచేశారు. సెప్టెంబర్ 1 నుంచి వీరిని జనరల్ మజ్దూర్లుగా గుర్తిస్తున్నట్టు ఆదేశాలు ఇచ్చారు. ఏడాదిలో భూగర్భ గనుల్లో కనీసం 190 రోజులు, ఉపరితల గనులు, వివిధ విభాగాల్లో కనీసం 240 రోజులు పని చేసిన బదిలీ వర్కర్లను రెగ్యులరైజ్ చేయడంపై హర్షం వ్యక్తమవుతున్నది. క్రమశిక్షణతో పనిచేసే వారికే గుర్తింపు వస్తుందని డైరెక్టర్ బలరామ్ చెపారు.

### ఏరియాల వారీగా..

శ్రీరాంపూర్ ఏరియాలో అత్యధికంగా 677 మందిని క్రమబద్ధీకరించారు. రామగుండం-1 ఏరియాలో 522, ఆర్జీ-3, అడ్రియాల ప్రాజెక్టులో 323, భూపాలపల్లిలో 274, మందమర్రిలో 261, మణుగూరులో 79, రామగుండం-2లో 51, బెల్లంపల్లి ఏరియాలో 32, ఇల్లందు, కార్పొరేట్ల నుంచి 19 మంది చొప్పున ఎంపిక కాగా, కొత్తగూడెం నుంచి 9 మంది రెగ్యులరైజ్ అయ్యారు. సీఎం కేసీఆర్ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు 2017 నుంచి నేటి వరకు 13,981 మందిని రెగ్యులరైజ్ చేశారు.

## రీడర్ అలవెన్స్ పెంపుపై హర్షం

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అంధ ఉపాధ్యాయులు, జూనియర్ అధ్యాపకుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రీడర్ అలవెన్స్‌ను పెంచడంపై బ్లైండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ హర్షం ప్రకటించింది. ఈ జీవో ద్వారా ఎస్జీటీ ఉపాధ్యాయులకు 1,200 నుంచి 1,600 వరకు, స్కూల్ అసిస్టెంట్లకు 1,500 నుంచి 2,000 వరకు, జూనియర్ అధ్యాపకులకు 2,000 నుంచి 2,500 వరకు అలవెన్స్ పెరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు కే మల్లేశం, ప్రధాన కార్యదర్శి బీ రాఘువేందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కే అనిల్ తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు.

# రేషన్ డీలర్ల కమీషన్ పెంపు

- హామీని నిలబెట్టుకున్న ప్రభుత్వం
- కమీషన్ పెంచుతూ ఉత్తర్వులు
- టన్నుకు రూ.700 నుంచి రూ.1,400లకు పెంపు
- 17 వేలకు పైగా రేషన్ డీలర్లకు లబ్ధి



శనివారం హైదరాబాద్‌లో మంత్రి గంగుల కమలాకర్‌కు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలియజేస్తున్న రేషన్ డీలర్ల జేఏసీ ప్రతినిధులు రాజు, రవీందర్, మల్లికార్జున్ తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ నిలబెట్టుకున్నారు. డీలర్ల కమీషన్ పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించి శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో టన్నుకు రూ.700గా ఉన్న కమీషన్‌ను ఇప్పుడు రూ.1,400లకు పెంచింది. అంటే కమీషన్‌ను ఒకేసారి రెండింతలు పెంచడం గమనార్హం. పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఇందుకు సంబంధించిన జీవో కాపీని రేషన్ డీలర్లకు అందజేశారు. కమీషన్ పెంపు నిర్ణయంతో ప్రభుత్వంపై ఏటా రూ.245 కోట్ల అధనపు భారం పడనున్నది. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలోని 17,227 మంది రేషన్ డీలర్లు, వారి కుటుంబాలకు లబ్ధి చేకూరనున్నది. కమీషన్ పెంపు అంశంపై గత నెల 8న మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్ రేషన్ డీలర్లతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కమీషన్ పెంచాలని నిర్ణయించారు. అనంతరం ప్రభుత్వ ఆమోదంతో శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కమీషన్ పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినందుకు రేషన్ డీలర్లు సీఎం కేసీఆర్‌కు, మంత్రి గంగుల కమలాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తాము ఎల్లప్పుడూ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల ప్రతినిధులు మంత్రి గంగులను సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. కేంద్రం వాటాకు మించి కమీషన్ అందించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, ఇందుకు కృషి చేసిన మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### రేషన్ డీలర్ల సేవలను గుర్తించిన కేసీఆర్

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రేషన్ డీలర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని మంత్రి గంగుల చెప్పారు. కమీషన్ పెంపు నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రేషన్ డీలర్ల సంక్షేమాన్ని సీఎం కేసీఆర్ కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కరోనా వంటి సంక్షోభ సమయంలో వారి సేవలను కేసీఆర్ గుర్తించారని తెలిపారు. కేంద్రంతో సంబంధం లేకుండా దాదాపు 90 లక్షల మంది పేదలకు పూర్తి రేషన్ బియ్యంను ప్రభుత్వమే సొంత ఖర్చులతో అందిస్తుందని చెప్పారు. ఇందుకోసం ఏటా రూ.3 వేల కోట్లను ప్రభుత్వం ఖర్చుచేస్తున్నదని వెల్లడించారు. సీఎం కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు ఇబ్బంది కలుగకుండా సేవలు అందించాలని రేషన్ డీలర్లకు సూచించారు.

# బీసీల సమాచారమివ్వండి

- సమగ్ర అధ్యయనంలో పాలుపంచుకోండి
- రాజకీయ, ఆర్థిక, సామాజిక స్థితిగతులపై నివేదికను అందించండి
- బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం
- ప్రభుత్వ శాఖాధిపతులతో భేటీ



బీసీ సంక్షేమశాఖ సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో (స్థానిక సంస్థల్లో) బీసీల ప్రాతినిధ్యం, పొందిన అవకాశాలపై ఆయా శాఖల వద్దనున్న సమాచారాన్ని, గణాంకాలను అందజేయాలని వివిధ ప్రభుత్వశాఖల అధికారులను రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు బీసీల స్థితిగతులపై చేపట్టిన సమగ్ర అధ్యయనంలో భాగస్వాములు కావాలని కోరారు. బీసీల సామాజిక స్థితిగతులపై శాస్త్రీయంగా అధ్యయనం చేపట్టి, సమగ్రమైన సిఫారసులతో నివేదికను సమర్పించాలని బీసీ కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే నిర్దేశించింది. సమాచార సేకరణలో భాగంగా ఖైరతాబాద్‌లోని తమ కార్యాలయంలో బీసీ కమిషన్ వివిధ ప్రభుత్వ విభాగాధిపతులతో నాలుగు రోజులుగా సమావేశాలను నిర్వహిస్తున్నది. ఇప్పటికే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ, జీహెచ్ఎంసీ, పౌరసరఫరాలశాఖ, సెర్ప్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ, గిరిజన సంక్షేమశాఖ, అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమశాఖ, ప్రణాళికశాఖ, వ్యవసాయశాఖ, పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య, ఉన్నత విద్యా మండలి, ఉపాధి, శిక్షణ, మహిళాభ్యుదయ, శిశు సంక్షేమశాఖలతో సమావేశాలను నిర్వహించింది.

### బీసీ సంక్షేమశాఖ అధికారులతో భేటీ

కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, సభ్యులు ఉపేంద్ర, శుభప్రద్ పటేల్ నూలి, కిశోర్‌గౌడ్ శనివారం బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సభ్య కార్యదర్శి అలోక్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో భేటీ అయ్యారు. అమలవుతున్న సంక్షేమ పథకాలు, రిజర్వేషన్ల తీరుతెన్నులు, కులాలవారీగా లబ్ధిదారుల వివరాలు, నిధుల కేటాయింపు, తదితర వివరాలు, విద్యార్థులు, ఉద్యోగుల వివరాలు, వివిధ అంశాలవారీగా సమీక్షించింది. కమిషన్ రూపొందించిన 'ప్రత్యేక ఫార్మాట్' ప్రకారం వివరాలను సేకరించి ఇవ్వాలని కోరారు. సమావేశంలో బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల సొసైటీ, వివిధ కార్పొరేషన్, ఫెడరేషన్ విభాగాల అధికారులు మల్లయ్య భట్టు, చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, విమలాదేవి, డీఆర్ ఉదయ్‌కుమార్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవితకు 'బ్రిడ్జ్ ఇండియా' ఆహ్వానం

**6న లండన్‌లో మహిళా బిల్లు, రిజర్వేషన్లపై మాట్లాడాలని పిలుపు**

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం, రిజర్వేషన్లపై లండన్‌లో నిర్వహించే సమావేశంలో కీలకోపన్యాసం చేయాలని ఎమ్మెల్సీ కవితకు ప్రముఖ స్వచ్ఛంద సంస్థ 'బ్రిడ్జ్ ఇండియా' ఆహ్వానించింది. మహిళా బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేసిన సందర్భంగా లండన్‌లో 6న సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆ సంస్థ ఆహ్వాన పత్రంలో పేర్కొన్నది. దీనికి హాజరు కావాలని కోరింది. రాజకీయాలు, ప్రజాస్వామ్య ప్రక్రియలో మహిళల భాగస్వామ్యం పెరగడానికి కవిత కృషి చేశారని ప్రశంసించింది. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం అనేక ఆందోళనలు చేపట్టారని, వివిధ రాజకీయ పార్టీల మద్దతును కూడగట్టడం లో కీలక పాత్ర పోషించారని తెలిపింది.పలు రకాల కార్యక్రమాలతో దేశవ్యాప్తంగా మహిళా బిల్లుపై చర్చను రేకెత్తించారని పేర్కొన్నది. జంతర్‌మంతర్ వద్ద దాదాపు 6వేల మందితో ధర్నా చేశారని, ఈ కార్యక్రమానికి 18 పార్టీల నేతలు హాజరై మద్దతు ప్రకటించారని తెలిపింది. మహిళా రిజర్వేషన్ల ఆవశ్యకతపై ఢిల్లీలో భారత జాగృతి జరిపిన సమావేశంలో 13 రాజకీయ పార్టీలతో పాటు మహిళా, విద్యార్థి, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారని గుర్తు చేసింది.

## ఉచిత విద్యుత్తుపై విపక్షాలవి పిచ్చికూతలు

**పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో 24 గంటలు నాణ్యమైన విద్యుత్తు ఇస్తుంటే.. రైతులు తమకు కావాల్సినప్పుడే మోటర్లు పెట్టి నీళ్లు వాడుకొంటుంటే తట్టుకోలేని ప్రతిపక్ష నాయకులు పిచ్చి కూతలు కూస్తున్నారని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యవసాయరంగం ప్రగతి పథాన దూసుకుపోతుంటే ఓర్వలేనితనంతో ఆరోపణలు చేస్తున్నారని శనివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. విపక్షాలు తలకిందులుగా తపస్సు చేసి నా అధికారం అందని ద్రాక్షేనని వ్యాఖ్యానించారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ రికార్డు సృష్టించడం ఖాయమని పునరుద్ఘాటించారు.